నాడు అక్రమమైతే.. నేడు సక్రమం ఎలా?

తార్నాక ఎర్రకుంట చెరువు భూమిల్లో వెలిసిన కమర్షియల్ నిర్మాణాలను కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు(ఫైల్)





కొన్ని రోజుల తర్వాత అదే స్థలంలో చేపట్టిన నిర్మాణం

- గతంలో ప్రభుత్వ స్థలం వెలిసిన నిర్మాణాలు కూల్చివేత
- అదే స్థలంలో యథేచ్ఛగా పూర్తయిన కట్టడాలు
- తూతూ మంత్రంగా కూల్చివేతలు
- రాజ్యమేలుతున్న కబ్జాదారులు

లాలాపేట: అధికారులు అలసత్వం కబ్జాదారుల దౌర్జన్యాలతో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను చూసి కూడా మౌనంగా ఉంటున్న జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు, వాటిపై ఫిర్యాదు చేస్తే హడావుడిగా వెళ్లి తూతూ మంత్రంగా కూల్చేస్తున్నారు. కూల్చిన కొన్ని రోజుల్లోనే అదే స్థలంలో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. తమ పని కూల్చడమే తప్ప మళ్లీ నిర్మాణాలు చేస్తే తమ బాధ్యత కాదన్నట్లు వ్యవహరిస్తున్నారని పలు ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మౌనాన్ని ఆసరాగా చేసుకుంటున్న భూ కబ్జాదారులు, అక్రమ నిర్మాణాలతో విజృంభిస్తున్నారు. ఫలితంగా రూ. కోట్ల విలువ చేసే భూములు అన్యాక్రాంతం కాగా, అక్రమ నిర్మాణాలతో జీహెచ్ఎంసీ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి సైతం గండి పడుతున్న దుస్థితి తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో కొనసాగుతుంది.

ఎర్రకుంట చెరువులో..

తార్నాక ఎర్రకుంట చెరువు భూములు సర్వే నెంబర్ 123, 124లో కొందరు వ్యక్తులు చేపట్టిన నిర్మాణాలు అక్రమ అంటూ మారేడుపల్లి రెవెన్యూ అధికారులు 2021 జూన్ 10న కూల్చివేశారు. గత రెండేళ్ల క్రితం ఓ వ్యక్తి చెరువు భూమిలో షెడ్ నిర్మాణం చేసి అందులో కమర్షియల్ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. ఈ రెండింటిపై ఫిర్యాదు అందుకున్న మారేడుపల్లి రెవెన్యూ, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటిని కూల్చి వేశారు. సదరు వ్యక్తుల నుంచి ఆ నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తామని రాత పూర్వంగా హామీ తీసుకున్నారు. సీన్ కట్ చేస్తే.. కూల్చిన ప్రాంతంలోనే మళ్లీ నిర్మాణాలు వెలిసినా సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు.

ప్రభుత్వ భూమిలో చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)





టౌన్‌ప్లానింగ్ అధికారులు అడ్డుకున్న నిర్మాణం ప్రస్తుతం ఇలా..

ఎక్కడైతే అధికారులు కూల్చివేశారో ప్రస్తుతం మళ్లీ అదే ప్రాంతంలో నిర్మాణాలు పక్కాగా దర్శనమిస్తుండటంతో అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల తీరుతోనే విలువైన ప్రభుత్వ భూములు కనుమరుగవ్వడంతో పాటు కబ్జాదారులకు అండగా నిలుస్తున్నట్లు అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తార్నాక ఎర్రకుంట చెరువు భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించి విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

నియామకం



అలేఖ్య ప్రతాప్

రసూల్‌పురా: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పీఎల్. అలేఖ్య ప్రతాప్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ అలేఖ్య ప్రతాప్‌ను నియామకాన్ని బుధవారం ప్రకటించారు. ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన సిద్ధాంతి కళాశాల, అక్షర వాగ్దేవి విద్యా సంస్థల చైర్మన్ పీఎల్. శ్రీనివాస్ కుమార్తె అలేఖ్య ప్రతాప్ సైకాలజీ, కౌన్సెలింగ్ స్కిల్స్, బీఎంఎస్, పీజీడీ, ఎంఈడీ, ఎమ్మెస్సీ ఫైనాన్స్ విద్యనభ్యసించారు. ఈ సందర్భంగా అలేఖ్య మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు.

విద్యా రంగ సమస్యలపై టీఎస్‌పీ పోరాటం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మరో విద్యార్థి సంఘం పురుడుపోసుకుంది. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీఎస్‌పీ) జెండాను రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌యాదవ్, ప్రొ.గాలి వినోద్‌కుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి నేతలకు తగిన ప్రాతినిధ్యం లభించడంలేదన్నారు. టీఎస్‌పీ భవిష్యత్‌లో విద్యా రంగ సమస్యలతో పాటు సామాజిక తెలంగాణ కోసం పని చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంజి పాల్వాయి నగేష్, వలిగిండ నరసింహ, సైదులు, ఉదయ్ పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా సహకరించాలి

ఈఆర్‌ఓ సుభాష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్ రావు

సికింద్రాబాద్: ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పార్టీలకతీతంగా సహకరించాలని ఈఆర్ఓ సికింద్రాబాద్ సర్కిల్ డీసీ సుభాష్ రావు కోరారు. బుధవారం సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్‌లలో 1500 మందికి మించి ఓటర్లు ఉండకుండా సమీప పోలింగ్ బూత్‌లలోకి ఓటర్లను మార్చడం జరుగుతుందన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌లపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఏఆర్వో ఎస్. ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి కృషి చేయాలన్నారు. ఎలాంటి అభ్యంతరాలున్నా నిర్ణీత సమయంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఆర్వో హేమలత, డీటీ భార్గవి, సెక్షన్ ఇన్‌చార్జి భుజేందర్ బాబు, వివిధ రాజకీయ పార్టీల నేతలు రాజసుందర్, జలంధర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, ప్రకాష్‌గౌడ్ నర్సింగ్‌రావు, కరుణాకర్ పాల్గొన్నారు.

పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలి



విజయ డెయిరీ ఎండీకి వినతి పత్రం ఇస్తున్న పాడి రైతులు

లాలాపేట: పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పది జిల్లాలకు చెందిన పాడి రైతులు లాలాపేటలోని విజయ డెయిరీ ప్రధాన ద్వారం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గత 50 రోజుల నుంచి పాల బిల్లులు రాక రైతులంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పశువుల దాణాకు డబ్బులు లేక అప్పుల పాలవుతున్నామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా పాల బిల్లులు చెల్లించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాడి రైతులకు చెల్లించిన లీటరు పాలపై రూ. 4 ఇన్సెంటివ్ బకాయిలను చెల్లించడంతో పాటు రేవంత్ సర్కారు ఇస్తామని ప్రకటించిన రూ. 5 ఇన్సెంటివ్ హామీని అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా పాడిరైతుల సమస్యలపై అధికారులతో చర్చించిన ఎండీ చిట్టెం లక్ష్మీ, ఐఏఎస్ అధికారి రైతులతో మాట్లాడి 20 రోజుల సమయం ఇవ్వండి పరిస్థితులన్నింటిని చక్కదిద్దుతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సాదం రమేష్, ఇమ్మడి శ్రీనివాస్, సాగర్, కె. ఉప్పలయ్య, పది జిల్లాలకు చెందిన పాడి రైతులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చడం అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: గత రెండున్నర దశాబ్దాలకు పైగా బాటసారుల దాహార్తిని తీరుస్తుండడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. బేగంపేటకు చెందిన సీనియర్ నేత షేక్‌గౌస్ ఆధ్వర్యంలో ప్రతియేటా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. బేగంపేట ప్రధాన రహదారిలోని ప్రకాష్‌నగర్ వాటర్‌వర్క్స్ కార్యాలయం పక్కన మర్రి చెన్నారెడ్డి స్మారక వాటర్ క్యాంప్‌ను బుధవారం శశిధర్‌రెడ్డి ప్రారంభించారు. గత 27 సంవత్సరాలుగా బేగంపేట ప్రధాన రహదారిలో వెళ్లే ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులు, ఇతర వాహనదారులు, బాటసారుల దాహార్తిని తీరుస్తూ వస్తున్నారు. మూడు నెలల పాటు ఈ క్యాంప్ నిర్వహణకు షేక్‌గౌస్ ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తూ చల్లటి మంచినీటిని ప్రయాణికులకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మర్రి పురురవరెడ్డి, నెమలి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనులపై చర్యలు తీసుకోండి



31బస్టాప్ ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషనర్ రొనాల్డ్ రాస్

రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ జెడ్సీ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యతో కలిసి మోండా మార్కెట్, టకారాబస్తీ, 31 బస్టాప్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆల్ఫా హోటల్ నుంచి సుభాష్ రోడ్డులో రోడ్డు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన ఆక్రమణలు తొలగించాలని సూచించారు. అశోక్‌నగర్ కమ్యూనిటీహాల్‌ను సెక్యూరిటీ సిబ్బంది ఆక్రమించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని ఆదేశించారు. టకరా బస్తీలో బంగారం దుకాణంకు చెందిన చెత్తను రోడ్డు పక్కన వేయడంతో వారికి రూ.50వేల జరిమానా విధించారు. రెజిమెంటల్‌బజార్‌లో లాడ్జీలకు పార్కింగ్ లేక రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారని, ఫైర్ సేఫ్టీ పాటించడం లేదని, కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవడం లేదని కార్పొరేటర్ ఆయన దృష్టికి తేగా వెంటనే అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఈ సుదర్శన్, ఏఈ రవీందర్, టౌనప్లానింగ్ ఏసీపీ కిష్టఫర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

సనత్‌నగర్: జెక్‌కాలనీ కిట్టీపార్టీ మహిళల ఆధ్వర్యంలో బుధవారం కాలనీ రెండో రోడ్డులో మహిళా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ ఎస్.అన్నపూర్ణ, కుర్రా కృష్ణకుమారి నేతృత్వంలో కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళా దినోత్సవ విశిష్టతపై ప్రసంగించారు. మహిళలు తలచుకుంటే ఏ రంగంలోనైనా అగ్రస్థానంలో ఉంటారన్నారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, కోట నీలిమ, ప్రభ, కృష్ణకుమారి, భాగ్య, అమరావతి, విజయ, శైలజ,ఐమ, హరిత, పద్మలత,అరుణ, శారద, బేబి, వాణి, జ్యోతి పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్నిమాపక పరికరాల పనితీరును వివరిస్తున్న ఫైర్ ఆఫీసర్ ప్రదీప్

సనత్‌నగర్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని అగ్నిమాపక అధికారులు సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలనే అంశంపై సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ అధికారులు అమీర్‌పేటలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో బుధవారం అవగాహన కల్పించారు. సనత్‌నగర్ ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ ఆధ్వర్యంలో అగ్నిమాపక పరికరాలను వినియోగించి మంటలను ఆర్పే విధానాలను నేరుగా ఆస్పత్రి వైద్య సిబ్బందితో చేయించారు. భవనాల్లో నిప్పు ఆర్పే పరికరాలు పెట్టుకుంటున్నారని.. చాలా మందికి వాటిని ఎలా ఉపయోగించాలో తెలియదని దీంతో పరికరాలు ఉన్నా నిరుపయోగంగా మారుతున్నాయన్నారు. ముఖ్యంగా వేసవి సమీపిస్తున్న దృష్ట్యా ముందుగా తాము ఆస్పత్రులపై దృష్టి పెట్టామని ముఖ్యంగా నడవలేని స్థితిలో ఉండే రోగుల విషయంలో ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో సిబ్బంది, వైద్యులకు సూచిస్తున్నామన్నారు. ప్రతీవారం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలనే ఉద్దేశంతో అందుబాటులో ఉన్న పరికరాల ఆధారంగా ప్రాథమిక స్థాయిలోనే మంటలను ఎలా అదుపు చేయవచ్చో వివరించడంతో పాటు తీవ్రత పెరిగితే ఆ సమయంలో తీసుకునే చర్యలను సూచిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ్, ఆర్ఎంఓ రవూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి



విద్యార్థులతో టీటీఐ ఏసీపీ వెంకటేశ్వర్లు

సనత్‌నగర్: చిన్నతనం నుంచి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉండదని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ ఎస్.వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. టీటీఐ ఏసీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తొలిసారిగా బేగంపేటలోని ఉద్భవ్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పిల్లలకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా రోడ్డు భద్రతా, నియమాల గురించి పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలని రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివితేనే ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. అనంతరం హీరో మోటో పార్క్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాసీరతో పాటు టీటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు ఆసరాగా 'సఖి నివాస్'

నేడు ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సఖి నివాస్

కంటోన్మెంట్: ఒంటరి మహిళలకు ఆసరా కల్పించేందుకు కంటోన్మెంట్ బోర్డు పరిధిలో 'సఖి నివాస్' పేరిట వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ అందుబాటులోకి వచ్చింది. రూ.5.90 కోట్ల వ్యయంతో మడ్‌ఫోర్ట్‌లో నిర్మించిన ఈ భవనాన్ని గురువారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ, కంటోన్మెంట్ బోర్డు సంయుక్తంగా నిర్మించిన ఈ హాస్టల్‌లో ప్రస్తుతానికి 50 మంది మహిళలకు వసతి కల్పించనున్నారు.

పుష్కర కాలం.. ఆరుగురు సీఈఓలు

2010లోనే కంటోన్మెంట్ సీఈఓ రవీందర్ హయాంలో మడ్‌ఫోర్ట్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మహిళా భవన్‌ను నిర్మించాలని భావించారు. ఈ మేరకు అప్పటి ఎమ్మెల్యే శంకర్ రావు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.25 లక్షల నిధులు మంజూరు చేయించారు. సీఈఓ బాలకృష్ణ హయాంలోనూ మహిళా భవన నిర్మాణం కోసం ప్రయత్నాలు జరిగినా, స్థలం కేటాయింపులో జాప్యంతో పనులు ముందుకు సాగలేదు. అనంతరం సీఈఓ సుజాత గుప్తా హయాంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. సీఈఓ చంద్రశేఖర్ హయాంలో ఆమోదం లభించగా, అజిత్‌రెడ్డి హయాంలో పనులు ప్రారంభమయ్యారు. ఎట్టకేలకు ప్రస్తుత సీఈఓ మధుకర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తి కావడంతో పాటు ప్రారంభోత్సవం చేయనున్నారు. బీ–4 కేటగిరికి చెందిన ఆర్మీ స్థలంలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, కంటోన్మెంట్ బోర్డు 40:60 నిష్పత్తిలో నిధులు వెచ్చించి నిర్మాణం పూర్తి చేశారు.

'ఎంసీహెచ్'లో పూర్తిస్థాయి సేవలు షురూ



ఎంసీహెచ్ ఆస్పత్రిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో సుమారు రూ. 50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి బుధవారం నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. గతేడాది ఆగస్ట్ 20న అప్పటి వైద్యశాఖ మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. గాంధీ ప్రధాన భవనం మొదటి, రెండో అంతస్తుల్లో కొనసాగుతున్న గైనకాలజీ విభాగంలోని పలు వార్డులను దశలవారీగా నూతన భవనంలోకి తరలించారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు నేతృత్వంలో బుధవారం లేబర్‌వార్డు, గైనకాలజీ, ఎంఐసీయూ, పోస్ట్ నెటల్, యాంటీనెటల్ తదితర వార్డులతో పాటు ఆయా వార్డుల్లో వైద్యసేవలు పొందుతున్న బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువులను ఎంసీహెచ్ భవనంలోని తరలించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రాజారావు మాట్లాడుతూ.. ఎంసీహెచ్ ఆస్పత్రిలో గైనకాలజీ విభాగానికి చెందిన అన్నిరకాల వైద్యసేవలు దశలవారీగా అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తెచ్చిన బుధవారం రోజే ఎమర్జెన్సీ ఎల్ఎస్‌సీఎస్ సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గైనకాలజీ హెచ్‌ఓడీ షర్మిల, వైద్యులు, ఆర్ఎంఓలు జయకృష్ణ, పద్మ, నర్సింగ్ పాల్గొన్నారు.

ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు మంత్రికి వినతి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

సికింద్రాబాద్: ప్రత్యేక లష్కర్(సికింద్రాబాద్) జిల్లాను ఏర్పాటు చేయాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లష్కర్ జిలా ఏర్పాటుకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో బాలరాజ్ యాదవ్, శైలేందర్, సునీల్ ముదిరాజ్, జగదీష్‌గౌడ్, అజీజ్, అశోక్, సాగర్ ఉన్నారు.

ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా సైదులు



సనత్‌నగర్: ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సైదులు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కొమరయ్య బదిలీ కాగా, ఆయన స్థానంలో సైదులును నియమిస్తూ పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రధాని ప్రసంగం ఎల్‌ఈడీ స్క్రీన్‌లో వీక్షణ

సికింద్రాబాద్: నామాలగుండులోని బీఎస్ఆర్ గార్డెన్స్‌లో బుధవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నాగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవో సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా తిలకించారు. శ్యాంసుందర్ గౌడ్, మేకల సారంగపాణి, రాంభూపాల్‌గౌడ్, కనకట్ల హరి, పోచయ్య, ప్రభుగుప్త, మహేష్, రమేష్, ప్రకాష్‌గౌడ్ శారద మల్లేష్, మేకల కీర్తి పాల్గొన్నారు.

దయానందుడి మార్గం.. అందరికీ శ్రేయస్కరం



సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని ఆర్య సమాజ్‌లో అధ్యక్షులు గంగాధర్ నేతృత్వంలో మహర్షి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ తెలుగు శాఖాధిపతి, విశ్రాంత ఆచార్య మసన చెన్నప్ప హాజరై మాట్లాడారు. ఆర్య సమాజం ఒక మతం కాదని అది శ్రేష్ఠ పురుషుల సమూహమన్నారు. విశ్వజనులను ఆర్యులు (శ్రేష్ఠ పరుషులు)గా చేయటమే దాని ఉద్దేశమన్నారు. మహర్షి జీవితంలోని కొన్ని సంఘటనలను వివరిస్తూ దయానందుడు నడిచిన వేద మార్గమే అందరికీ శ్రేయస్కరమన్నారు. అనంతరం సాహిత్య పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రావికంటి కృష్ణమూర్తి, నర్సయ్య, యాదగిరి, ఉప్పల కిషోర్‌బాబు పాల్గొన్నారు.

సీపీఎస్ అమలుకు అధ్యాపకుల ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: కాంట్రిబ్యూటరీ (సీపీఎస్) పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఓయూ అధ్యాపకులు ర్యాలీ చేపట్టారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ నుంచి వీసీ భవనం వరకు ర్యాలీ చేపట్టి ధర్నా చేశారు. ఓయూ నుంచి రావాల్సిన రూ. 48 కోట్లను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ అమలుతో రాష్ట్రంలోని అన్ని వర్సిటీల అధ్యాపకులు లబ్ధి పొందుతుండగా కేవలం ఓయూ అధ్యాపకులు మాత్రం రూ.40 లక్షలు నష్ట పాతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వీసీ ప్రొ.రవీందర్ అధ్యాపకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సీపీఎస్ అమలు కోసం చర్చించారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిపై కేసు

సనత్‌నగర్: బస్సు కోసం వేచి చూస్తున్న వ్యక్తి చేతిలోని సెల్‌ఫోన్ తీసుకుని పరారైన ఘటనా ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కరీంనగర్‌కు చెందిన బండి ప్రశాంత్ కూకట్‌పల్లి సమీపంలోని ఇందిరాహిల్స్‌లో ఉంటున్నాడు. స్వగ్రామం వెళ్లేందుకు మంగళవారం తెల్లవారుజామున అమీర్‌పేటలోని మైత్రీవనం వద్ద బస్సు కోసం నిరీక్షిస్తుండగా యాక్టీవాపై వచ్చిన ఓ అగంతకుడు చేతిలోని ఫోన్‌ను లాక్కోని పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ. 1.50 లక్షలతో పరార్

సనత్‌నగర్: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ డబ్బులు కాజేసిన వ్యక్తిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బీకేగూడలోని ఆదిత్యానగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం అమీర్‌పేట ఈస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ ఆలయానికి వచ్చే పృథ్వీ అనే వ్యక్తితో సుబ్రహ్మణ్యంతో పరిచయం ఏర్పడింది. డబ్బు చెల్లిస్తే తాను ప్రభుత్వ క్లర్క్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. తనకు తెలిసిన మిత్రుడికి ఉద్యోగం కావాలంటూ రెండు విడతలుగా రూ.1.50 లక్షలు పృథ్వీకి చెల్లించాడు. ఆ తర్వాత పృథ్వీ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నూతన విద్యావిధానాన్ని అందిపుచ్చుకోవాలి

లాలాపేట: నేటి విద్యా వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పులు, నూతన జాతీయ విద్యా విధానంలోని అంశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సరోజినీనాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్ డాక్టర్ బి. ప్రభాశంకర్ అన్నారు. నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డేను పురస్కరించుకుని బుధవారం తార్నాకలోని సరోజినీ నాయుడు వనిత ఫార్మసీ మహావిద్యాలయంలో 'జాతీయ విద్యా విధానం అమలుకు సినర్జిజం పరిశ్రమ అకాడమీయా భాగస్వామ్యం ప్రభావితం' అనే అంశంపై ఒక్క రోజు సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు రాజమౌళి, ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ, రఘురామారావు, డాక్టర్ శ్రీనివాస్ ఆరుట్ల, అజయ్‌పాండే, శ్రీకాంత్ తదితరులతో కలిసి ప్రభాశంకర్ సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాయినాథ్, డైరెక్టర్ శ్రీనివాస్, సరిత, జోష్నా పాల్గొన్నారు.